
ఆంధ్రజ్యోతి



మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.3 ; కనిష్ఠం 23.6

కామారెడ్డి
జిల్లా వార్తలు

5

బుధవారం 25 సెప్టెంబరు 2024

మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదగాలి: డీపీఎం

భిక్కనూరు, సెప్టెంబరు24: మహిళాసంఘాల సభ్యులు ప్రతీఒక్కరు ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఐకేపీ డీపీఎం సుధాకర్ అన్నారు. మంగళవారం భిక్కనూరు రైతువేదికలో మండల సమాఖ్య 18వ వార్షిక మహాసభ సమావేశాన్ని అధ్యక్షురాలు రాజమణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ మహిళా సంఘాల పని తీరు బాగుందని ప్రశంసించారు. కొత్త కార్యక్రమాలు, పలు అంశాలపై సభ్యులకు అవగాహన కల్పించారు. సమాఖ్యవార్షిక నివేదికను ఏపీఎం శ్రీనివాస్ చదివి వినిపించారు. కార్యక్రమంలో సీసీలు, సభ్యులు పాల్గొన్నారు.



అసైన్డ్ లెక్క తేలేనా?

- ఎల్ఆర్ఎస్ పరిశీలనలో భాగంగా అసైన్డ్‌భూముల గుర్తింపునకు కసరత్తు
- మూడుశాఖల భాగస్వామ్యంతో ప్రక్రియ
- ప్రభుత్వ చర్యలతో అక్రమార్కులు, స్థల యజమానుల్లో కలవరం
- జిల్లాలో బడాబాబుల గుప్పిట్లో అసైన్డ్ భూములు
- 46 వేల ఎకరాలకు పైగా అన్యాక్రాంతం
- కబ్జా అయిన అసైన్డ్ భూముల్లో రియల్ దందా
- వెంచర్లుగా మార్చి ప్లాట్లుగా మార్చిన వైనం
- అధికారులను మచ్చిక చేసుకుని ఎన్‌వోసీలు పొందిన పరిస్థితి
- జిల్లాలో 1.37లక్షల ఎకరాల అసైన్డ్ భూములను పేద రైతులకు పంపిణీ

కామారెడ్డి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అమలుచేస్తున్న ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో ప్రభుత్వ అసైన్డ్‌భూముల గుర్తింపును నిర్వహించాలనే నిర్ణయానికి వచ్చినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. దీంతో జిల్లాలో ఎక్కడ అసైన్డ్ భూములను ప్లాట్లు చేశారు, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో అసైన్డ్ భూములు ఏ మేరకు ఉన్నాయి, అందులో ఎన్ని అన్యాక్రాంతం అయ్యాయి అనే అంశాలపై ఓ స్పష్టత రానుంది. ఇదే సమయంలో అసైన్డ్ భూముల లెక్క పక్కగా నమోదుకానుంది. ఇప్పటివరకు జిల్లాలో అసైన్డ్ భూములు ఎన్ని ఉన్నాయి, అవి ఎవరిచేతిలో ఉన్నాయి, ఎన్ని అన్యాక్రాంతం అయ్యాయనే లెక్కలు లేవు. గత ప్రభుత్వాలు ఈ దిశగా పెద్ద ప్రయత్నాలు చేయలేదు. అసలు అసైన్డ్ భూములపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దగా దృష్టిసారించినట్లు లేదనే ఆరోపణలు ఉన్నాయి.ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత కబ్జాదారులు రూ.కోట్లది విలువైన అసైన్డ్ భూములను అప్పన్నంగా కాజేసి దర్జాగా అందులో వెంచర్లు చేసి విచ్చలవిడి అమ్ముకుని సొమ్ముచేసుకున్నారు. ప్రస్తుతం ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులు చేసుకున్న ప్లాట్ల యాజమానులలో చాలామందివి ఇలాంటివే ఒక్కసారి అవి రెగ్యులర్ అయితే ఇక శాశ్వతంగా వారి స్వంతమైనట్లే.

అసైన్డ్‌భూములపై ప్రభుత్వం దృష్టి

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించేటప్పుడు అసైన్డ్ భూములపై ప్రధానంగా దృష్టిసారించాలని ప్రభుత్వం కలెక్టర్‌లకు ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జారీచేసిన మార్గదర్శకాలలో ఎల్ఆర్ఎస్ ఆమోదం కోసం క్షేత్రస్థాయిలో జరిపే పరిశీలనలో మున్సిపల్ అధికారులకు తోడు రెవెన్యూ, నీటిపారుదలశాఖలకు భాగస్వామ్యం కలిపించింది. దీంతో ఒక్క మున్సిపాలిటీ అధికారులు లేదంటే వారి కిందిస్థాయి సిబ్బంది మాత్రమే పరిశీలన జరిపేవారు. అయితే ఆ స్థలాలు అసైన్డ్‌భూముల కాదా అనేది తమకు అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం మాత్రమే ధృవీకరించుకునేవారు. మున్సిపాలిటీ వద్ద అరకొర రికార్డుల వల్ల కొన్నిసార్లు అసైన్డ్ స్థలాలు సైతం రెగ్యులరైజ్ అయిన సందర్భాలు ఉన్నాయి. దీనికి తోడు కొందరు మున్సిపల్ అధికారులు, కిందిస్థాయి సిబ్బంది క్షేత్రపరిశీలనలో అవి అసైన్డ్ భూములు అని తేలిన ముడుపులకు ఆశపడి రెగ్యులర్ చేసిన దాఖలాలు కూడా ఉన్నాయి. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈసారి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలనలో మున్సిపలతోపాటు రెవెన్యూ, నీటిపారుదల శాఖలను కూడా భాగస్వామ్యం చేస్తోంది.

గత ప్రభుత్వాలలో లక్షల ఎకరాల్లో భూ పంపిణీ

జిల్లాలో భూమిలేని నిరుపేదలకు గత ప్రభుత్వాలు అసైన్డ్ మెంట్ భూములను పంపిణీ చేసి సాగు చేసుకునేందుకు అందించారు. ఇలా జిల్లాలో సుమారు 1.37 లక్షల ఎకరాలకు పైగా అసైన్డ్‌మెంట్ భూములకు పేద రైతులకు పంపిణీ చేసినట్లు రెవెన్యూరికార్డులు చెబుతున్నాయి. బీసీ వర్గాలకు 65,933 ఎకరాలలో 43,503 మంది లబ్ధిదారులకు అసైన్డ్‌భూములను పంపిణీ చేయగా, ఎస్టీలకు 22,709 ఎకరాలలో 11,726మంది లబ్ధిదారులకు, ఎస్సీలకు 31,110 ఎకరాల అసైన్డ్‌మెంట్ భూములను 22,921 మంది లబ్ధిదారులకు, మైనార్టీలకు 9,470 ఎకరాలు, 2,575 మంది లబ్ధిదారులకు, ఇతరవర్గాలకు 9,470 ఎకరాలు 5736 మంది లబ్ధిదారులకు అసైన్డ్ భూములను పంపిణీ చేశారు.

బడాబాబుల చేతిలో 46 వేల ఎకరాల అసైన్డ్‌మెంట్ భూములు

కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ రెవెన్యూ డివిజన్‌ల పరిధిలో 1.37 లక్షల పైగా 87,685 మంది నిరుపేద రైతులకు పంటల సాగుకై అసైన్డ్ భూములను గతంలో పంపిణీ చేశారు. ఇందులో 46వేల ఎకరాల అసైన్డ్ భూములు అన్యాక్రాంతం అయినట్లు ఇప్పటివరకు నిర్వహించిన పలు సర్వేల్లో వెల్లడైంది. కబ్జాఅయిన భూములన్నీ బడాబాబుల చేతిలో ఉన్నట్లు తెలుస్తోంది. భూ దస్త్రాల ప్రక్షాళనలో అసైన్డ్‌భూముల సమగ్ర వివరాలను సమీకరించారు. అవి ఎవరి చేతిలో ఉన్నాయనే వివరాలతో పాటు ఎవరికి కేటాయించారనే సమాచారం సేకరించారు. వాటిని 23(ఎ)లో నమోదుచేశారు. అయినప్పటికి పేదలకు కేటాయించిన భూములు చాలావరకు బడాబాబుల చేతిలోనే ఉన్నట్లు నిర్ధారణ అవుతుంది. చట్టంలోని లోసుగులను ఆసరాగా చేసుకుని అధికారులకు మామూళ్లు ఇచ్చి బడాబాబులు అసైన్డ్‌మెంట్ భూములకు ఎన్‌వోసీలు తెచ్చుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎన్‌వోసీలు వచ్చిన తర్వాత ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ దందా మొదలెడుతున్నారు. జిల్లాలోని పట్టణ శివారులతో పాటు మండలాలోని భూముల విలువలు అమాంతంగా పెరిగిపోయాయి. దీంతో కబ్జాదారులు,బడాబాబుల కన్ను అసైన్‌మెంట్, కబ్జా భూములపై పడుతుంది.

అడ్డదారుల్లో ఎన్‌వోసీలు పొందిన వైనం

జిల్లాలో పలు పట్టణాల్లో, గ్రామాలలో ప్రభుత్వ అసైన్డ్‌మెంట్ భూముల విషయంలో అక్రమార్కులు ఉన్నతాధికారులను మచ్చిక చేసుకుని తప్పుదోవ పట్టించి ఎన్‌వోసీలు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. అసైన్డ్,ఖాళీ స్థలాలు కనబడితే చాలు పలువురు అక్రమార్కులు, నేతలు గద్దల వాలుతూ రోజుల వ్యవధిలోనే నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి అసలు డాక్యుమెంట్‌లకు తీసిపోకుండా తాతల కాలం నాటి డాక్యుమెంట్‌లను సృష్టిస్తున్నారు.ఆ డాక్యుమెంట్‌లు చేతులో పెట్టుకుని కబ్జాలు పెట్టి అసైన్డ్‌మెంట్ భూములలో ఎండ్ల నుంచి పంట సాగు చేసుకుంటున్న వారితోనే తిరిగి సెటిల్‌మెంట్‌లు చేస్తు అయితే డబ్బులు లేదంటే జాగాను కొట్టెస్తున్నారు. ఇందుకు పలువురు డాక్యుమెంట్ రైటర్లు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఎదో ఒకరకంగా మాయ చేసి రిజిస్ట్రేషన్‌లు జరిగే విధంగా చూస్తున్నారనే వాదనలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.

కామారెడ్డిలో ఉద్రిక్తత

- జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చిన్నారి పట్ల పీఈటీ అసభ్య ప్రవర్తన
- నిందితుడిని శిక్షించాలని చిన్నారి బంధువులు, విద్యార్థి సంఘనాయకుల ఆందోళన
- ఆందోళనకారులకు మద్దతుగా నిరసనలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్
- పాఠశాలను మూసివేయాలని డిమాండ్
- ఆందోళనకారులను సముదాయించేందుకు ప్రయత్నించిన సీఐ, ఏఎస్పీ
- తోపులాట.. గుంపులోంచి వచ్చిన రాయి.. సీఐ తలకు తీవ్రగాయం
- అపస్మారక స్థితికి చేరుకున్న ఎస్సై, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్
- లాఠీచార్జ్‌చేసి ఆందోళన కారులను చెదరగొట్టిన పోలీసులు
- పరిస్థితిని సమీక్షించిన అదనపు కలెక్టర్, ఎస్పీ
- కామారెడ్డిలో పెద్దఎత్తున పోలీసు పికెటింగ్



నిరసన కారులకు మద్దతు తెలిపి ఆందోళనలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 24: జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలలో ఓ ఆరేళ్ల చిన్నారి పట్ల పీఈటీ నాగరాజు అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించడంపై చిన్నారి కుటుంబీకులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. అయితే మూడురోజుల క్రితం పీఈటీ నాగరాజు చిన్నారి పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో చిన్నారిపాఠశాలకు వెళ్లేందుకు భయపడింది. ఇదేంటని చిన్నారి తల్లిదండ్రులు ఆరాతీయడంతో జరిగిన విషయం తల్లిదండ్రులకు వివరించింది. దీంతో కుటుంబీకులు సోమవారం రాత్రి కామారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. మంగళవారం ఉదయం చిన్నారి కుటుంబీకులు, విషయం తెలుసుకున్న విద్యార్థిసంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. పీఈటీ నాగరాజును ఉద్యోగం నుంచి తీసేయాలని, పాఠశాల ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకుంటామని పాఠశాల యాజమాన్యం వివరించింది. విద్యార్థులపై ఈరకంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పాఠశాలను సీజ్‌చేయాలని, శాశ్వతంగా గుర్తింపు రద్దు చేయాలని విద్యార్థిసంఘ నాయకులు ఆందోళన నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు సైతంఆందోళనలో పాల్గొన్నారు. దీంతో పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆందోళనకారులను సముదాయించే ప్రయత్నంచేయడంతోపాటు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామని చట్టప్రకారం కఠిన శిక్షపడేలా చూస్తామని హామీ ఇచ్చారు. అయినా ఆందోళన ఆగలేదు. ఈ విషయం తెలుసుకున్న కామారెడ్డి మున్సిపల్‌చైర్‌పర్సన్ ఇందుప్రియ ఆందోళనకారులకు మద్దతు పలకడంతోపాటు విద్యాశాఖాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పాఠశాలలో ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు సరైన విధంగా స్పందించడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారు వచ్చేదాక కదలబోమని కూర్చున్నారు. అప్పటికే మరికొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులు, ఇతరులు అక్కడికి వచ్చి ఆందోళనలో పాల్గొనడంతో పరిస్థితి చేజారుతుందని ఏఎస్పీ నరసింహరెడ్డి, డీఎస్పీ నాగేశ్వర్‌రావులు అక్కడికి చేరుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. అయినా ఆందోళన చేస్తున్నవారు వెనక్కి తగ్గకపోవడంతో పాటు తోపులాట చోటుచేసుకుంది.

• గుంపులోంచి రాయి విసిరిన గుర్తుతెలియని వ్యక్తి.. సీఐ తలకు గాయం



గాయపడ్డ సీఐ



ఎస్సైను ఆసుపత్రికి తీసుకెళ్తున్న పోలీసులు

ఆందోళన చేస్తున్నవారిని పోలీసులు అదుపుచేస్తున్న క్రమంలో గుంపులోంచి గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు విసిరారు. దీంతో ఓ రాయి పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తలకు తగిలింది. తీవ్ర రక్తస్రావం కావడంతో పట్టణ సీఐని ఆటోలో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. తోపులాటలో పట్టణ ఎస్సై రాజారాం సైతం తీవ్రఅస్వస్థతకు గురవడంతో ఆయనను సైతం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ అజారోద్దిన్‌కు కాలువిరగడంతో ఆయనను ఆసుపత్రికి తరలించారు. దీంతో పోలీసులు లాఠీచార్జి చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు.

ఆందోళన చేస్తున్నవారిలో మరికొందరు అక్కడే ఉండి మరోమారు నిరసనకు దిగారు. ఎస్పీ సి ంధూశర్మ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆందోళన చేస్తున్న వారి డిమాండ్లను అడిగి తెలుసుకోవడంతోపాటు చట్టపరంగా ఏ విధంగా చర్యలు తీసుకుంటామనేది వివరించారు. అప్పటికీ బయట మరోచోట ఆందోళన చేస్తుండడంతో ఎస్పీ, అదనపు కలెక్టర్ అక్కడికి చేరుకుని సముదాయించే ప్రయత్నంచేశారు. అక్కడినుంచి పట్టణ పీఎస్ వరకు చేరుకోవడంతో మరోమారు పోలీసులు లాఠీచార్జ్‌చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు.

• మూడు జిల్లాల పోలీసుల భారీ బందోబస్తు

పాఠశాల వద్ద పెద్దఎత్తున ఆందోళన జరగడం, పట్టణ సీఐతోపాటు ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలుకావడంతోపాటు ఆందోళన కారులు పలుచోట్ల నిరసనలు తెలుపవడంతో కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాల పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఎక్కడ కూడా అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పలుచోట్ల పికెటింగ్‌ను ఏర్పాటుచేశారు. చిన్నారిపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై ఇప్పటికే పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైందని నిందితుడికి చట్టప్రకారం శిక్షపడేలా చేస్తామని, ఎవరూ ఆందోళనకు గురికావద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని ఎస్పీ సింధూశర్మ తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమకు తెలిపిన విషయాలు కలెక్టర్ దృష్టికి తీసుకుపోతామని తెలిపారు.



లాఠీచార్జి చేస్తున్న పోలీసులు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ అజారోద్దిన్

పీఈటీపై పోక్సో కేసు నమోదు: ఎస్పీ

కామారెడ్డి టౌన్: ఆరేళ్ల చిన్నారి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ప్రైవేటు పాఠశాల పీఈటీ నాగరాజుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్పీ సింధూశర్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న పీఈటీ నాగరాజు పాఠశాలలోని చిన్నారిపట్ల అసభ్యంగా ప్రవర్తించాడని సోమవారం చిన్నారి తల్లిదండ్రులు ఫిర్యాదుచేయడంతో కామారెడ్డి పట్టణ పీఎస్‌లో పోక్సో, భారతీయ న్యాయసంహిత చట్టాల కింద పోక్సో చట్టం కింద కేసునమోదుచేసి అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. స్కూల్‌యాజమాన్యం ఏదైనా విషయాలు దాచినా, నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించిస్తే విచారించి వారిపైనా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఘటనపై నిరసనలు వ్యక్తమైన సమయంలో కొందరు వ్యక్తులు రాళ్లు రువ్వారని, సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తలకు తీవ్రగాయమైందని, మరికొందరు పోలీసులు సైతం గాయపడ్డట్లు తెలిపారు. ప్రజలు వదంతులను నమ్మొద్దని, శాంతియుతంగా ఉండాలని ఎస్పీ కోరారు.


నిజాంసాగర్ వరద గేట్ల ఎత్తివేత

• 10 వేల 105 క్యూసెక్కుల వరద నీరు మంజీరా నదిలోనికి...

నిజాంసాగర్, సెప్టెంబరు24: నిజాంసాగర్ ప్రాజెక్టులోనికి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతూ ఉండటంతో మంగళవారం నీటిపారుదల శాఖ అధికారులు వరద గేట్లలోని రెండింటినీ ఎత్తి 8వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోనికి వదిలేస్తున్నారు. ప్రధానకాలువ ద్వారా మరో 2వేల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి 10,105 క్యూసెక్కుల నీరు వస్తోంది. ప్రస్తుతం నిజాంసాగర్‌లో 17.701 టీఎంసీలు నీటిని నిలువ చేస్తున్నారు. ఎగువ నుంచి వచ్చే నీటిని నేరుగా వరద గేట్ల ద్వారా ప్రధాన కాలువ ద్వారా విడుదల చేస్తూ ఉన్నారు. రెండు రోజులుగా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటి కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి వరద వస్తుండడంతో గేట్లను ఎత్తి నీటిని వదలుతున్నట్లు నీటిపారుదల శాఖ అధికారి శివప్రసాద్ తెలిపారు.

పరిసరాల శుభ్రతను పాటించాలి: కలెక్టర్

రాజంపేట, సెప్టెంబరు24: పరిసరాల శుభ్రతను ప్రతీఒక్కరూ పాటించాలని, మొక్కలు నాటి వాటిని విధిగా సంరక్షించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జరిగిన పలు కార్యక్రమాల్లో కలెక్టర్ పాల్గొని జిల్లా గ్రామీణ అభివృద్ధి ఆధ్వర్యంలో స్వచ్ఛతసేవ కార్యక్రమం సందర్భంగా పల్లెప్రకృతి వనం, ప్రాథమిక ఆరోగ్య, కస్తూర్బా బాలిక విద్యాలయాల్లో కలెక్టర్ మొ క్కలు నాటారు. స్వచ్ఛత సేవ కార్యక్రమంలో భాగంగా కేజీబీవీ విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలను తిలకించి విద్యార్థులకు బహుతుల ను కలెక్టర్ అదించారు. ఈసందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా కోసం అనేక కార్యక్రమాలు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఉన్నత చదువులను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. వంట గదులను పరిశీలించి విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని మండల అభివృద్ధి అధికారికి సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలు, ధరణి వివరాలు, మండలంలోని విస్తీర్ణం అడిగితెలుసుకున్నారు. రాజంపేటశివారులో ఉన్న శంకదార రైస్‌మిల్‌ను తనిఖీచేసి రైస్‌మిల్‌కు కేటాయించిన వరిధాన్యాన్ని త్వరగా సీఎంఆర్‌కు సరఫరా చేయాలన్నారు. రైస్‌మిల్‌లో వరిధాన్యం బస్తాలను లెక్కించేలా పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ్‌రావు, జిల్లాపౌరసరఫరాల అధికారి మల్లికార్జున్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పద్మ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.





ఈ విద్యా సంవత్సరం నుంచే
బీఈడీలో నూతన సిలబస్

డిచ్‌పల్లి, సెప్టెంబరు 24: ఈ విద్యా సంవత్సరం నుంచి తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ నూతన సిలబస్‌ను ప్రవేశ పెట్టిన సందర్భంగా ఆడిట్ సేల్ అధికారులు మంగళవారం దానికి సంబంధించిన బ్రోచర్‌ను రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి ఆవిష్కరించారు. నేడు వర్సిటీ ఈ నూతన సిలబస్‌పై ప్రత్యేకంగా అవగహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంటా చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమానికి అన్ని అనుబంధ బీఈడీ కళాశాలల ప్రిన్సిపాళ్లు హాజరుకావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమానికి ప్రొ. అరుణ ఆడిట్ సేల్ జాయింట్ డైరెక్టర్ అతిక్ సుల్తాన గోరీ, వర్సిటీ ఎడ్యుకేషన్ విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ డా.శంకర్‌లు పాల్గొంటారని తెలిపారు. అనంతరం పాఠ్యంశం ప్రణాళికపై డా.శంకర్, డా.వేద ప్రకాశ్‌తో అవగహన కార్యక్రమాలు ఉంటాయని చంద్రశేఖర్ తెలిపారు.

మేనేజ్‌మెంట్ విభాగంలో స్పెషలైజేషన్ ఎంపికపై సెమినార్

డిచ్‌పల్లి, సెప్టెంబరు 24 : తెలంగాణ విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ విభాగంలో స్పెషలైజేషన్ ఎంపికపై సెమినార్ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో స్పెషలైజేసన్ ప్రాముఖ్యతను వివరించారు. మారుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో విద్యార్థులు నైపుణ్యాలు నేర్చుకోవాలని వివిధ స్పెషలైజేషన్‌లలో ప్రావీణ్యం సంపాదించాలని విద్యార్థులకు ఉద్బోధించారు. సెమినార్ డైరెక్టర్ అంజనేయులు విద్యార్థులకు స్పెషలైజేషన్ ఎంపికలో పదతులను వివరించారు. వర్సిటీ పరిధిలోని గౌతమి, నిశిత, వర్సిటీ ఎంబీఏ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విదార్థులకు ప్రొ. కైసర్ మహమ్మద్, అపర్ణ, రాజేశ్వరి, వాణి, విద్యార్థులకు అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ సేల్ డైరెక్టర్ ఆచార్య ఘంట చంద్రశేఖర్, రాంబాబు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్యశిబిరం

ముప్కాల్, సెప్టెంబరు 23: బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్ లయన్స్ భవన్‌లో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దంత వైద్య నిపుణుడు డాక్టర్ నిహార్ 140మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. గ్రామంలోని 50మంది దంత పరీక్షలు నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జ్ఞానసాగర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దినేష్ బాయ్‌పటేల్, చాకు లింగం, పెంట జీవన్, పోతు ప్రసాద్, వంశీరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేందర్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ 7 గేట్ల ఎత్తివేత

● ప్రాజెక్టులోకి 45వేల క్యూసెక్కుల నీరు చేరిక

డొంకేశ్వర్, సెప్టెంబరు 24: ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు విష్ణుపురి గేట్లను ఎత్తివేయడంతో ప్రాజెక్టులోకి 45వేల858 క్యూసెక్కుల వరదనీరు చేరుతుండడంతో ప్రాజెక్టు ఏడు వరద గేట్లను గోదావరిలోకి 21వేల868క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్టు ప్రాజెక్టు ఏఈఈ వంశీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులోకి ఉదయం 29వేల వరద నీరు చేరగా ప్రాజెక్టు నాలుగు గేట్లను ఎత్తి 12వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మధ్యాహ్నం ప్రాజెక్టులోకి 45వేల 858క్యూసెక్కుల నీరు వరద పెరగడంతో ఏడు వరద గేట్లను ఎత్తి 21వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి వరదకాలువ ద్వారా 15వేల క్యూసెక్కుల, కాకతీయ కాలువకు 6800క్యూసెక్కుల ఎస్కేప్ గేట్ల ద్వారా 1200క్యూసెక్కుల, అలీసాగర్, గుత్పకు 180క్యూసెక్కుల అవిరి రూపంలో 700క్యూసెక్కుల నీరు విడుదల జరుగుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00 అడుగులు (80.5టీఎంసీ)లు కాగా సోమవారం సాయంత్రానికి 1091.00 అడుగులు (80.501టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని ఎస్సారెస్పీ అధికారులు తెలిపారు. జూన్ ఒకటోవ తేదీ నుంచి ప్రాజెక్టులోకి 190టీఎంసీల నీరు చేరగా ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా ప్రధానకాలువల ద్వారా 118టీఎంసీల నీరు విడుదల చేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

వేల్పూర్, సెప్టెంబరు 23: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామానికి చెందిన జాబిరి రమేష్ అన్న జాబిరి మహేష్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ మంగళవారం మృతుల కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలియజేశారు. మృతుని కుటుంబం నిరుపేద కుటుంబం కావడంతో రూ.10వేల ఆర్థిక సహాయాన్ని కాంగ్రెస్ నాయకుల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సునీల్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

'విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి'

భీమ్‌గల్, సెప్టెంబరు23: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల వివరాలు ప్రశస్త్ యాప్‌లో నమోదు చేయాలని మండల విద్యాధికారి స్వామి తెలిపారు. మంగళవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో ఒక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో స్వామి మాట్లాడుతూ ప్రతీ పాఠశాల హెచ్‌ఎం దివ్యాంగ విద్యార్థులను గుర్తించి ప్రశస్త్ యాప్‌లో లాగిన్ అయి వారి వివరాలను పొందుపర్చాలని సూచించారు. ఈ శిక్షణలో ఐఈఆర్‌పీలు జలంధర్, కిషన్, ఐఈ ఉపాధ్యాయుడు రామకృష్ణ, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా దినోత్సవం

భీమ్‌గల్, సెప్టెంబరు 23: పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ విద్యార్థిని విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్‌తో పాటు సమాజ సేవ చేస్తూ సమాజాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుమలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.సుదర్శన్, అకాడమి కో ఆర్డినేటర్ డాక్టర్ బి.శ్రీనివాస్, అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.











పార్టీలకతీతంగా సేవ చేస్తా

● ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 23: ప్రజలందరికీ పార్టీలకతీతంగా సేవ చేయడానికే వచ్చానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయంగా మాట్లాడే వారి మాటలకు సమాధానం చెప్పావల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా అనారోగ్యంతో గాని, శ్రస్త చికిత్స కోసం ఆసుపత్రిలో చేరితే సీఎం సహాయనిధి, ఎల్‌వోసీ, ఢిల్లీలో రాయితీ ఇప్పించే బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్యే అన్నారు. గత ప్రభుత్వంలో సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఆరోగ్య శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ పేరిట కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, పరిసరాల శుభ్రతే కాకుండా ప్రజల ఆరోగ్యంతో పాటు పరిసరాల శుభ్రతే కాకుండా ప్రజల ఆరోగ్యం కూడా బాగుండాలన్నారు. ప్రతీఒక్కరు సంస్కారం, స్వచ్ఛతగా ఉండాలని, అప్పుడే ఈ దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, సర్వసమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు, కలిగోట గంగాధర్, జెస్సు అనిల్, యామాద్రి భాస్కర్, సుంకరి రంగన్న, ఆకుల శ్రీనివాస్, పొల్కం వేణు, ఖాందేశ్ ప్రశాంత్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాల ఏర్పాటు అభినందనీయం

రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం ద్వారా అపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయడమేనని ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మామిడిపల్లిలో ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నర్సింహం నాయుడు జన్మదినం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోటపాటి నర్సింహం నాయుడు ఆర్మూర్ ప్రాంత రైతులకు, గల్ఫ్ కార్మికులకు గత కొన్నేళ్లుగా సేవలందిస్తున్నారని నిస్వార్థంగా చేస్తున్న ఆయన సేవలకు తోడుగా యువకులను సమీకరించి రక్తదాన శిబిరం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకులు లోక భూపతిరెడ్డి, బద్దం లింగారెడ్డి, గోవింద్‌పేట్ ఆనంద్, రుక్మాజీ, అంకారిగారి శంకర్, కె.రమేష్, భాస్కర్, జీజీ రాం, నాగరాజు, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు భూస అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.


నూతన కమిటీని అభినందిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే పోచారంను కలిసిన వర్ని ఏఎంసీ కమిటీ

వర్ని, సెప్టెంబరు 24: వర్ని మండల నూతన మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సురేష్ బాబాతో పాటు డైరెక్టర్ల నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఆయన నివాసంలో చందూర్ మండల నాయకుల ఆధ్వర్యంలో కలిశారు. చందూర్‌కు చెందిన వేములపల్లి సుధాకర్ రావు, ఎస్‌కే.హైమదలను డైరెక్టర్లుగా నియమించినందుకు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ ప్యారం అశోక్ యాదవ్, బి.సత్యనారాయణ, కర్లం సాయిరెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గొర్తి వెంకటేశ్వర రావు, సలీం, వసంత రావు, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం


ఏఎంసి చైర్మన్ గంగారెడ్డిని సన్మానిస్తున్న బాడ్సి సొసైటీ పాలకవర్గం

మోపాల్, సెప్టెంబరు 24: నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముప్ప గంగారెడ్డి నియమితులైన సందర్భంగా మంగళవారం మండలంలోని బాడ్సి ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు ఘనంగా సన్మానించారు. పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని గంగారెడ్డి ఈ సందర్భంగా కోరారు. సొసైటీ చైర్మన్ వెంట పాలకవర్గం సభ్యులు, సొసైటీ కార్యదర్శి తదితరులు గంగారెడ్డిని సన్మానించిన వారిలో ఉన్నారు. అలాగే రాణాకుర్దు మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జలేందర్‌రెడ్డి కూడా గంగారెడ్డిని ఘనంగా సన్మానించారు. అదేవిధంగా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఆయనను సన్మానించిన వారిలో ఉన్నారు.

గంగాసారంలో ఇంటిపై పిడుగు

డొంకేశ్వర్, సెప్టెంబరు 23: ఇంటిపై పిడుగు పడిన ఘటన డొంకేశ్వర్ మండలం గంగాసారం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గంగసరం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి భారీ గాలి, దుమారం, ఉరుములు, మెరుపులు వచ్చాయి. ఈ క్రమంలో అచ్చుకారి చిన్నభోజారెడ్డి ఇంటిపై పిడుగు పడింది. ఆ సమయంలో ఇంట్లో కుటుంబసభ్యులు నిద్రిస్తు న్నారు. ఎవరికి ఏలాంటి ప్రమాదం జరగలేదు. పిడుగు దాటికి కొంత స్లాబ్‌కు రంధ్రమై ధ్వంసం కాగా పిడుగుపాటుతో కరెంటు మీటర్లు మంటలు ఏర్పడి కొన్ని ఇంట్లో ఎలక్ట్రానిక్ వసుతవులు, టీవీ, ఫ్రీజ, కూలర్, ఏసీ ధ్వసం అయి నట్టు బాధితుడు తెలిపారు. అలాగే పిడుగుపాటుకు 20వరకు ఫ్యాన్‌లు, టీవీలు చెడిపోయినట్టు గ్రామస్థులు తెలిపారు. పిడుగుపాటుకు గంగాసారం గ్రామంలో భారీ నష్టం జరిగినట్టు గ్రామస్థులు తెలిపారు.

పార్ట్‌టైం ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవీపేట, సెప్టెంబరు 24: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు పార్ట్‌టైం ఉపాధ్యాయుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ జైనాథ్ రాజ్ తెలిపారు. పాఠశాలలో పీజీటీ ఫిజిక్స్, పీజీటీ బోటమి పోస్టులు ఖాళీగా ఉన్నాయని సంబంధిత సబ్జెక్టుతో పాటు పీజీ, బీఈడీ అర్హత గల అభ్యర్థులు ఈ నెల 26లోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలను మరుసటి రోజు నిర్వహించనున్నామని ఆయన పేర్కొన్నారు.

జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

మోర్తాడ్, సెప్టెంబరు24: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని జి.రితిక హైదరాబాద్‌లోని రమ్యాగ్రౌండ్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి 43వ జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైందని పాఠశాల పీఈటీ సింధుజ తెలిపారు. హర్యాలో ఈనెల 26నుంచి 30వ తేదీ వరకు జరగనున్నయని తెలిపారు. ఎంపికైన రితిక బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్ష, కార్యదర్శులు మానస గణేష్, శ్యామ్, పాఠశాల హెచ్‌ఎం తమ్మిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

కొనసాగుతున్న శిక్షణ

కోటగిరి, సెప్టెంబరు 24: మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ మంచి నీటి సహాయకులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు మంగళవారం రెండవ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా మిషన్ భగీరథ డీఈ మున్నీ నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో మంచినీటి సహాయకులకు శిక్షణ ఇస్తుందన్నారు. చేతి పంపుల నిర్వహణ, మరమ్మతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో చందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

డొంకేశ్వర్, సెప్టెంబరు24: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేశారు. ఈ ఘటన డొంకేశ్వర్ మండల కేంద్రంలో సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం డొంకేశ్వర్ శివారులో పేకాట ఆడుతున్న పక్క సమాచారంతో పోలీసులు దాడి చేశారు. అక్కడ ఆడుతున్న డొంకేశ్వర్ గ్రామానికి చెదిన తొమ్మిది మందిని వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.14వేల 800 నగదుతో పాటు తొమ్మిది బైక్‌లు, ఆరు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

కోటగిరి: పొతంగల్ మండలంలోని టాక్లీ గ్రామ శివారులో మంగళవారం పేకాట స్థావరంపై ఎస్‌ఐ సందీప్ దాడి చేశారు. పేకాటస్థావరంలో 10,740 రూపాయల నగదుతో పాటు నలుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేశామన్నారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కాలువలో పడి మహిళ గల్లంతు

మోస్రా,సెప్టెంబరు 24: నిజామాబాద్ రూరల్ మండలంలోని కొత్తపేట్ గ్రామానికి చెందిన పెద్దోళ్ల లక్ష్మి(48)అనే మహిళ మంగళవారం నిజాంసాగర్ ప్రధాన కాలువలో పడి గల్లంతు అయినట్టు ఎస్సై రామారావు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పెద్దోళ్ల లక్ష్మి ఆమె భర్త లింగం, కొడుకు, కూతురితో కలిసి గ్రామ శివారులోని నిజాంసాగర్ కాలువలో బట్టలుతుకుతుండగా లక్ష్మి ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడిపోయింది. గమనించిన భర్త గట్టిగా అరిచి కాపాడేందుకు కాలువలో దూకాడు. వెంటనే స్థానికులు లింగంను కాపాడారు. లక్ష్మి కాలువ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. మంగళవారం రాత్రివరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ఇసుక వేలం పాట

కోటగిరి,సెప్టెంబరు 24: పొతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఇసుక వేలం పాట నిర్వహించారు. సుంకిని గ్రామ సమీపంలో 10 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసి వేలంపాట నిర్వహించగా సుంకిని గ్రామానికి చెందిన రమేష్ అనే వ్యక్తి 25 వేలకు ఇసుకను వేలంలో దక్కించుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

టిప్పర్ పట్టివేత

రుద్రూరు, సెప్టెంబరు 24: రుద్రూరులో ఓ ఇసుక టిప్పర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై సాయన్న పేర్కొన్నారు. మంగళవారం ఇసుకను అక్రమంగా కోటగిరి నుంచి బోధన్‌కు తరలిస్తుండగా రుద్రూరులో ఇసుక టిప్పర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయులదే అత్యున్నత స్థానం

● కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజా శ్రీనివాస్


కమ్మర్‌పల్లిలో ఉత్తమ ఉపాధ్యాయులతో మండల అధికారులు

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 24: సమాజంలో ఉపాధ్యాయులదే అత్యున్నత స్థానం అని భావిభారత పైరులుగా తీర్చిదిద్దడంలో వారి పాత్ర అమోఘమని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజా శ్రీనివాస్ అన్నారు. ఉపాధ్యాదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక మండలప్రజాపరిషత్ సమావేశ మందిరంలో మండల విద్యాశాఖ అద్వర్యంలో భాస్కర షార్మసిస్ వ్యవస్థాపకుడు భాస్కర్ యాదవ్ సహకారరంతో మండల ఉత్తమ ఉపాధ్యాయులు సన్మాన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎన్ ఆందయ్యతో కలిసి ఆయాన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృఇతోనే ఎందరో ఉన్నత స్థాయిలో నిలుస్తున్నారని విద్యాబోధన చేసే ప్రతీ ఉపాధ్యాయుడు ఉత్తమ ఉపాధ్యాయుడేనన్నారు. ఈ కార్యక్రమంలోమండల నోడల్ అధికారి గంగాధర్ సన్మాన గ్రహీతలు పాల్గొన్నారు.

రుద్రూరు ఎంపీవోగా లక్ష్మణ్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ


ఎంపీవో లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు, తదితరులు

రుద్రూరు, సెప్టెంబరు 31: రుద్రూరు నూతన ఎంపీవోగా లక్ష్మణ్‌రెడ్డి మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన నిజామాబాద్ డీఆర్‌డీఏ నుంచి బదిలీపై రుద్రూరుకు ఎంపీవోగా వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సురేష్‌బాబు, మండల పంచాయితీ కార్యదర్శులు, మండల ప్రజాప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నారోజీ గంగారాం, నాగేందర్, పత్తి రాము, లక్ష్మణ్, తోట్ల పెద్ద గంగారాం, బాల్‌రాజ్, ఏపీవో రాజేశ్వర్, మండల పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ రాజశ్రీ

మాక్లూర్, సెప్టెంబరు23: విద్యార్థులు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ రాజశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని దాస్‌నగర్ గ్రామశివారులో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ మహిళ డిగ్రీ కళాశాలలో ఆరోగ్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థినులకు రక్త నమూన, రక్తహీనత గల పిల్లలకు తదితర అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి కళాశాలతో పాటు గ్రామాల్లో కూడా ప్రతీఒక్కరికి ఆరోగ్యం పట్ల అప్రమత్తం చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో అంజన, డాక్టర్ అశోక్, డాక్టర్ రవితేజ, డాక్టర్ లావణ్య, డాక్టర్ తుకారం తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థిని చితకబాదిన టీచర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి'

మెండోర, సెప్టెంబరు 24: మెండోర మండలం పోచంపాడ్ గురుకుల పాఠశాలలో చదువుతున్న 6వ తరగతి విద్యార్థి మూడ్ రాజుపై విచక్షణ రహితంగా చితకబాదిన టీచర్ రాజేశ్వర్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసు కోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సంద ర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్, యూ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బిగాల నాగరాజ్, టీఎన్‌వీఎస్ నాయకుడు వెంటేష్‌లు మాట్లా డుతూ శుక్రవారం రాత్రి బాత్‌రూం వస్తుందని విద్యార్థి వెల్లడంతో ఆ సమయంలో డ్యూటీలో ఉన్న టీచర్ రాజేశ్వర్‌రెడ్డి, వాచ్‌మెన్ సురేష్‌లు విద్యార్థి రూంకు వచ్చి నువ్వు ఎక్కడికి వచ్చావని విద్యార్థి రాజుపై విచా క్షణ రహితంగా దాడికి పాల్పడ్డారని, అదే సమయంలో విద్యార్థితో రాజే శ్వర్‌రెడ్డి కొట్టినట్టు ఎవరితోనైన చెబితే ఇలాగే కొడతానని టీసీ ఇచ్చి ఇంటి కి పంపించాలని భయభ్రాంతులకు గురి చేస్తూ బెదిరించడం జరిగిందని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. ఈ విషయమై విద్యార్థి సంఘాల నాయకులు మెండోర పోలీస్‌స్టేషన్‌లో టీచర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సురేందర్‌ను వివరణ కోరగా విద్యార్థి ప్రహరీ వద్ద ఉన్న మరుగు దొడ్ల గొడ ఎక్కి బయటదూకి మరో ముగ్గురు విద్యార్థులతో బయట ఉన్న దుకాణాల వద్ద తినుబండారాలు కొనుగోలు చేసి రావడం జరిగిందని మందలించడం జరిగిందని, ఇలానే రెండవ మరో ముగ్గురు విద్యార్థులతో రాత్రి వేళ వెళ్లి గొడబయట దూకుతూ తినుబండరాలను కొనుగోలు చేసి వస్తుండగా మళ్ళీ ఎక్కడికి వెళ్లావని అడిగితే ఎలాంటి సమాధానం లేక పోవడంతో మందలించి విద్యార్థి తల్లి దండ్రులకు సమాచారం ఇవ్వగానే విద్యార్థి తల్లిదండ్రులు వచ్చి విద్యార్థిని ని తీసుకు వెళ్లారని, ఎలాంటి దెబ్బలు కొట్ట లేదని వివరించారు.


మెండోరలో నిరసన తెలుపుతున్న విద్యార్థి తల్లిదండ్రులు

చెరువులో మునిగి జాలరి మృతి


మృతి చెందిన పల్లికొండ భూమన్న

నవీపేట,సెప్టెంబరు 24: మండలంలోని మహంతంకు చెందిన పల్లికొండ భూమన్న(61)అనే జాలరి కాళ్లకు వల చుట్టుకుని చెరువులో ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందాడని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. ఈ నెల 22న సాయంత్రం గ్రామ శివారులోని కండ సముద్రం చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి రాత్రి అయినప్పటికీ ఇంటికి చేరుకోలేదని అన్నారు. మరుసటి రోజు అతని ఆచూకి గురించి గాలించినప్పటికి లభ్యం కాలేదని మంగళవారం స్థానిక చెరువులో అతని మృతదేహం బయటపడిందని ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడి కుమారుడు పల్లికొండ సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జేసీబీ, ఇసుక లారీ సీజ్

కోటగిరి,సెప్టెంబరు 24: పొతంగల్ మండలంలోని జల్లాపల్లి ఫారం గ్రామంలో మంగళవారం భారీ ఇసుక లారీతో పాటు జేసీబీని సీజ్ చేసినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. జల్లాపల్లి ఫారంలో అక్రమంగా ఇసుక డంప్ చేసి జేసీబీ సాయంతో భారీ లారీలలో ఇసుక నింపుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు అప్పగించడంతో పాటు మైనింగ్, ఎంవీఐ అధికారులకు సమాచారం అందించామన్నారు. అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అవినీతిపై విచారణ జరిపించాలి

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 24: మండలంలోని సుర్బిర్యాల్ గ్రామస్థులు తాజామాజీ సర్పంచ్ సబిత గణేష్‌పై అవినీతిపై విచారణ జరపాలని మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలో సర్పంచ్ భర్త గణేష్ దళిత బంధు డబ్బులతో ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపట్టడంతో సర్వజన సంఘం వారు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. దీంతో సర్వజన సంఘం సభ్యులు గణేష్‌కు మధ్య గొడవకు కారణమైంది. ఈ విషయమై గణేష్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గ్రామస్థులు ఇంటికోకరు చొప్పున పోలీస్‌స్టేషన్ ఆవరణలో బైటాయించారు. గణేష్‌పై విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఏసీపీ బస్వారెడ్డి, తహసీల్దార్ గజానన్ గ్రామస్థులతో మాట్లాడి విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏసీపీ బస్వారెడ్డి మాట్లాడుతూ వీడీసీలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని కుల, గ్రామబహిష్కరణలతో పాటు జరిమానాలు విధిస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వీఆర్‌ఏలు

నవీపేట, సెప్టెంబరు 24: రెవెన్యూ శాఖలో పని చేస్తూ 61 సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏలను రెగ్యులర్ చేస్తూ వారి స్థానంలో కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరుతూ సంబంధిత వీఆర్‌ఏల వారసులు మంగళవారం తహ సీల్దార్ వెంకట రమణకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో 61సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏలు 3,797 మంది ఉన్నారని ప్రస్తుతం వారి వారసులు ఆయా మండల రెవెన్యూ కార్యాలయాలలో గత కొన్ని సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నారని అన్నారు. గతంలో వేలాది మంది వీఆర్‌ఏలను రెగ్యులర్ చేయడం జరిగిందని, మిగిలిన 3,797మంది 61సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏల వారసులకు జీవో నెంబర్ 81, 85ల ప్రకారం నియామక పత్రాలను ఇవ్వాలని వారు తమ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పెంటయ్య, నర్సయ్య, సుధాకర్, గంగాధర్, గీత, రేణుక, విజయ, జ్యోతి, సువర్ణ, తదితరులున్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు

పెర్కిట్, సెప్టెంబరు 24: ఈనెల 21, 22 తేదీల్లో ఆర్మూర్ మండలం మిర్దాపల్లి గ్రామంలో నిర్వహించిన అంతర్ పాఠశాలల క్రీడోత్సవాల్లో ఆలూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.నరేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ గరడి రాజేష్, విద్యార్థులను అభినందించారు. క్రీడోత్సవాలలో ఆలూర్ పాఠశాల విద్యార్థులు మార్చ్‌ఫస్ట్‌లో ద్వితీయస్థానం, జూనియర్ బాలికల విభాగంలో కబడ్డీలో ద్వితీయస్థానం, బాలికల సబ్‌జూనియర్ వాలీబాల్‌లో ప్రథమ స్థానం, బాలుర సబ్ జూనియర్ కబడ్డీలో ప్రథమ స్థానంలో నిలిచారని పాఠశాల డైరెక్టర్ గరడి రాజేష్ తెలిపారు. ఈ కా ర్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజేష్, శౌరెడ్డి, నరేందర్, గణేష్, రాంప్రభు, సుబ్బారెడ్డి, శ్రీకాంత్, చిత్ర, హన్మాండు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను రక్షించిన పోలీసులు

మెండోర, సెప్టెంబరు 24: ఎస్సారెస్పీ రిజర్వాయర్‌లో ఆత్మహత్యా యత్నానికి యత్నించిన మహిళను మెండోర పోలీసులు రక్షించారు. ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం మోస్రా మండలం గోవూర్ గ్రామానికి చెందిన ఎరుకల పద్మ సోమవారం శ్రీరాంసాగర్ రిజర్వాయర్‌లో ఆత్మ హత్యాయత్నానికి యత్నించగా ఎస్సారెస్పీ అధికారులు, సిబ్బంది మహిళను గ్రహించి పోలీసులకు సమాచారం అందించడంతో హుటాహుటిన పోలీసులు వెళ్ళి మహిళనురక్షించి కుటుంబసభ్యులకు అప్పగించికౌన్సిలింగ్ ఇచ్చారు.

ఇద్దరు వ్యక్తులను చితకబాదిన గ్రామస్థులు

ఎడపల్లి, సెప్టెంబరు 24: పోచారం గ్రామంలో మంగళవారం గ్రామస్థులు ఇద్దరు వ్యక్తులను చితకబాదారు. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం ఎడపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మంగళవారం పోచారం గ్రామంలో ఈ నెల 19వ తేదీన ఆత్మహత్య చేసుకున్న మహిళ ఇంటికి వెళ్లారు. మహిళ ఆత్మహత్యకు సదరు వ్యక్తులే కారణమని ఆరోపిస్తూ గ్రామస్థులు వారిని చితకబాదారు.


వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు

వర్నిలో ముగిసిన క్రీడా పోటీలు

వర్ని, సెప్టెంబరు 24: వర్ని మండల కేంద్రంలో పీడీఎస్‌యూ 50వ వసంతాల సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని ఆ కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు నడిపింటి కార్తీక్ పేర్కొన్నారు. పీడీఎస్‌యూ విద్యార్థుల హక్కుల కోసం మరింత పోరాటం చేస్తోందని భరోసా ఇచ్చారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్, గోపాల్, అభయ్ సింగ్, మహేష్, రాకేష్, నాని తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శిగా రాజేశ్వర్


రాజేశ్వర్‌ను సన్మానిస్తున్న మోస్రా మండల ఉపాధ్యాయ బృందం

మోస్రా,సెప్టెంబరు 24: 2024-26కు సంబంధించి పీఆర్‌టీయూ టీఎస్ నిజామాబాద్ జిల్లా కమిటీ ఎన్నికల్లో మోస్రా జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు రాజేశ్వర్‌ను ఎన్నుకోగా జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన రాజేశ్వర్‌ను మండల శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎస్.రాములు, ప్రధానకార్యదర్శి ఎస్.విజయ భాస్కర్, మండల అసోసియేట్ అధ్యక్షుడు శత్రు, మండల మహిళా ఉపాధ్యక్షురాలు శోభాబాయి, మండల కార్యదర్శి శివశంకర్, మండల నోడల్ అధికారి మధుసూదన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎం.బాలాజీ రావు, మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

దుబ్బా తండాను పరిశీలించిన ఎంపీడీఓ

మోస్రా, సెప్టెంబరు 24: మండలంలోని చే నెంబర్ తండా దుబ్బను ఎంపీడీఓ ప్రవీణ్ రెడ్డి పరిశీలించారు. గ్రామంలో ఉన్న పలు సమస్యలు పరిష్కారం కోసం అన్ని విధాలుగా ప్రయత్నం చేస్తానని అదేవిధంగా గ్రామ పంచాయతీ కార్యాలయం నిర్మాణం కొరకు ఆర్జీ పెడతామని అన్నారు. గ్రామ పంచాయతీలో కార్యదర్శితో మాట్లాడి గ్రామ సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓతో పాటు కార్యదర్శి మహేశ్వరి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీరన్న తదితరులున్నారు.

పంట పొలాల రోడ్లకు నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న కంఠం గ్రామస్తులు

నందిపేట, సెప్టెంబరు 23: మండలంలోని కంఠం గ్రామంలో ఎస్సీ, బీసీ రైతుల పంట పొలాల్లో ఉన్న రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని డీసీసీ ఉపాధ్యక్షులు పెంట ఇంద్రుడు ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వర్షాలకు రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయని, పంట ఉత్పత్తులు పొలాల్లో నుంచి రావడానికి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. రోడ్ల మరమ్మతులకు రూ.20లక్షలు మంజూరు చేయాలని కోరారు. నిధుల మంజూరుకు హామీ ఇవ్వడంతో సుదర్శన్‌రెడ్డి రైతులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతులు పెంట ఇంద్రుడు, గురడి ప్రసాద్, సూది సుమన్ తధితరులు ఉన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

నందిపేట, సెప్టెంబరు 23: మండలంలోని చింరాజ్‌పల్లిలో ఉన్న శ్రీ కేదారేశ్వర ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నోవా అగ్రిటెక్ లిమిటెడ్ కంపెనీ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించింది. కంపెనీ సిబ్బంది బాబుసింగ్, జి.గణేష్ మాట్లాడుతూ రైతులకు పురుగు మందుల వాడకంపై అవగాహన కల్పించారు. వరి, పసుపు, మొక్కజొన్న, పంటలలో వచ్చే పురుగు, తెగుళ్ళను అరికట్టే సూచనలు, సలహాలు చేశారు. ఏ సమయంలో ఏ మందులు పిచికారి చేయాలో వివరించారు. శ్రీ కేదారేశ్వర ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ చైర్మెన్ కాపు వినయ్ కుమార్, డైరెక్టర్లు గుమ్మల సాయిలు, సిబ్బంది, ఆయా మండలాలకు చెందిన రైతులు తధితరులు ఉన్నారు.

క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 23: ఆర్మూర్ మున్సిపల్ పరిధి మామిడిపల్లిలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన అర్బన్ మండలస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో మంగళవారం అభినందన సభ నిర్వహించారు. విద్యార్థులు మార్చ్ ఫస్ట్‌లో ప్రథమ బహుమతి, బాలుర జూనియర్ ఖోఖో పోటీలో ప్రథమ, ఖోఖో సబ్ జూనియర్ బాలుర పోటీలో ప్రథమ, ఖోఖో జూనియర్ బాలికల పోటీల్లో ప్రథమ స్థానంలో పొందడంతో అథ్లెటిక్స్‌లో ఏడు బహుమతులు గెలుచుకున్నారు. విద్యార్థులను అభినందించడంతో పాటు పీఈటీ రాజేశ్వర్‌ను ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య శ్రీనివాస్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ షేక్‌మున్న, కౌన్సిలర్‌లు రవిగౌడ్, కాశీరాం, ఆకుల రాము, నాయకులు పండిత్ పవన్, వీడీసీ సభ్యులు రవి, లక్ష్మన్, రాజన్న, శ్రీనివాస్, హెచ్‌ఎం రవిందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా చింత శ్రీనివాస్

నవీపేట,సెప్టెంబరు 24: ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా నవీపేటకు చెందిన చింత శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక ఆర్యవైశ్య సంఘంలో జరిగిన సభ్యుల సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించారు. శ్రీనివాస్ గతంలో సంఘం మండల అధ్యక్షుడిగా పని చేయగా రెండవ సారి ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఎన్నిక నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాసవి సేవాదళ్ అధ్యక్షులు పోల సుధాకర్ గుప్తా, బి.పురుషోత్తం గుప్తా, మహంకాళి విజయ్‌కుమార్‌లతో పాటు సంఘం సభ్యులు బాలకృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

ధర్మోరా బాధితునికి ఎల్‌వోసీ అందజేత

మోర్తాడ్, సెప్టెంబరు 24: మండలంలోని ధర్మోరా గ్రామానికి చెందిన సీహెచ్.రమేష్ తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో ఆయనకు ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించగా పేద కుటుంబానికి చెందిన వారు కావడంతో సమాచారం తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ మంగళవారం రూ.2లక్షల 50వేల ఎల్‌వోసీని సీఎం సహాయ నిధి నుంచి అందజేశారు. ఈ సందర్భంగా ఆపద సమయంలో ఆదుకున్న సునీల్‌కుమార్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


అంగన్‌వాడీలను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

పిల్లల ఎదుగుదలపై శ్రద్ధ వహించాలి

సదాశివనగర్, సెప్టెంబరు 24: అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందజేయాలని, వారి శారీరక ఎదుగుదలపై ఎప్పటికప్పుడు శ్రద్ధ వహించాలని జడ్పీసీఈవో చందర్‌నాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని దగ్గి, తుక్కోజివాడి ప్రభుత్వ పాఠశాలలతో పాటు అంగన్‌వాడి కేంద్రాలను తనిఖీచేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులకు విద్యాబుద్ధులతో పాటు వారి అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయ సారిని పాటించి విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించాలని తెలిపారు. పాఠశాల పరిసర ప్రాంతాలను బోధించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సంతోష్‌కుమార్, ఎంపీఓ సురేందర్‌రెడ్డి, ఏపీఓ మధునాయక్ తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకం ద్వారా అదనపు ఆదాయం: డీపీఎం

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 24: మారుమూల గ్రామాల్లోగల రైతు సోదరులు వ్యవసాయంతోపాటు చేపల పెంపకం చేస్తే అదనపు ఆదాయం పొందవచ్చని ఇందిరా క్రాంతి పథం డీపీఎం రమేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం జుక్కల్, పెద్దకొడప్‌గల్ మండలకేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఎస్సీ, బీసీ లబ్ధిదారుల సమావేశంలో మాట్లాడారు, ఈ సందర్భంగా డీపీఎం రమేష్‌బాబు మాట్లాడుతు జుక్కల్ నియోజకవర్గంలోని వెనుకబడిన వారిని అభివృద్ధి చేసే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు సబ్సిడీపై చేపల పెంపకం యూనిట్లను మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ పథకం యూనిట్ విలువ 4.50 లక్షల రూపాయలు కాగా, ఇందులో ఎస్సీ లబ్ధిదారులకు ఎస్సీ కార్పొరేషన్ నుండి 2.25 లక్షలు, పిఎం అజయ్ పథకం నుండి 50 వేలు సబ్సిడీపై అందించడం జరుగుతుందని తెలిపారు. మిగతా రూ.1.75 లక్షలు బ్యాంకు రుణం అంది ంచడం జరుగుతుందని తెలిపారు. బీసీ లబ్ధిదారులకు 35 శాతం సబ్సిడీ, ఓసీలకు 25శాతం సబ్సిడీ అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునే రైతులు 20 గుంటల భూమి కలిగి ఉం డి, నీటి సౌకర్యం కలిగిన వారు అర్హులని తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలో ఉన్న వెనుకబడిన రైతులను అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఒకసారి చేపల యూనిట్ వేసుకుంటే దీని ద్వారా జీవితకాలం పాటు ఆదాయం పొందవచ్చని వివరించారు. అనంతరం లీడ్ బ్యాంక్ మేనేజర్ రవికాంత్ మాట్లాడుతూ తాము బ్యాంక్ లింకేజీ ద్వారా రైతులకు తొందరగారుణాలు అందజేస్తామని, రైతులు ఈ అవకాశాన్ని వదులుకోవద్దని తెలిపారు. కార్యక్రమంలో జుక్కల్ ఎంపిడివో శ్రీనివాస్, ఐకేపీ, ఏపీఎంలు సత్యనారాయణ, శిరీష; బ్యాంక్ మేనేజర్లు గోపాల్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

కొచ్చేరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, సెప్టెంబరు24: మండలంలోని మైలారం గ్రామ శివారులో గల కొచ్చేరి మైసమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం కొచ్చేరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహపంక్తి భోజనాలుచేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయకమిటీ ప్రత్యేక సౌకర్యాలు కల్పించింది.

కౌమార విద్యపై ఉపాధ్యాయులకు శిక్షణ

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు24: జిల్లావిద్యాశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో జిల్లాస్థాయిలో కౌమార విద్యపై ఉపాధ్యాయులకు శిక్షణ, విద్యార్థులకు పోస్టర్ మేళా నిర్వహించినట్లు డీఈవో రాజు తెలిపారు. జిల్లాలో 63 ప్రభుత్వ ఉన్నత, 4 కస్తూర్బా గాంధీ, ఐదు మోడల్, ఎనిమిది ప్రైవేట్ పాఠశాలలో కౌమార విద్య కార్యక్రమంలో భాగంగా కౌమార దశలో బాలబాలికలకు కలిగే శారీరక, మానసిక, ఉద్వేగపరమైన మార్పుల గురించి విద్యార్థులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించినట్లు తెలిపారు. హెచ్ఐవీ, ఎస్‌టీఐ సంక్రమిత వ్యాధుల నివారణకు అవసరమైన జీవన నైపుణ్యాలను పెంపొందించడం, మాదకద్రవ్యాల దుర్వినియోగానికి ఇతర ప్రమాదకర ప్రవర్తనలకి ఉన్న సంబందాలను, లైంగిక వేధిపులు, భావవ్యక్తీకరణ ద్వారా వ్యక్తుల మధ్య ఆరోగ్యవంతమైన సంబంధాలు ఏర్పాటుచేసుకోవడం, కౌమారానికి సంబంధించిన వివిధ అంశాలపై పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించినున్నట్లు తెలిపారు. అనంతరం పోస్టర్‌మేళాలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశాంసపత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్, ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం అధికారి సుధాకర్, వర్డ్ ఎన్‌జీవో ప్రతినిధి రాణి, విద్యాశాఖ కోఆర్డినేటర్ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

బీర్కూర్, సెప్టెంబరు24: మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో మంగళవారం ఉచితకంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. కంటి సమస్యలతో బాధపడే వారు పెద్దసంఖ్యలో శిబిరానికి తరలివచ్చారు. కళ్లను పరీక్షించి, కొందరికి కంటిఅద్దాలు, మరికొందరికి మందులను అందించారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు గాలు, సభ్యులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

గాంధారి, సెప్టెంబరు 24: గాంధారి మండల కేంద్రంలో అగ్నిప్రమాదాలపై మంగళవారం అగ్నిమాపక సిబ్బంది ప్రభుత్వ పాఠశాలలో, దుర్గానగర్‌కాలనీలో ప్రజలకు అవగాహన చేపట్టారు. అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. ప్రతీఒక్కరు అగ్నిమాపక సిబ్బంది విన్యాసాలను పరిశీలించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది వెంకట్‌రాజు,నవీన్, నరేందర్, శివ పాల్గొన్నారు.


అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

- ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్, సెప్టెంబరు 24: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. మంగళవారం నిజాంసాగర్, మహ్మద్‌నగర్ పరిధిలోని పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని మహ్మద్‌నగర్ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, బాలింతలు, శిశువులు పౌష్టికాహార లోపాలపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం లోపంతో రక్తహీనత, జనన బరువు తగ్గుదల తదితర ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయన్నారు. గర్భిణీ స్త్రీలు సరైన పౌష్టికాహారం తీసుకుంటే తల్లిబిడ్డ ఎలాంటి పోషకాహార లోపం లేకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రు పాలు పట్టించాలని, ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే బిడ్డకు ఆహారంగా ఇవ్వాలని, తల్లి పాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని, బిడ్డ ఎదుగుదలకు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ప్రభుత్వం పౌష్టికాహారాన్ని సకాలంలో అందించాలని ఆయన వైద్య ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

బిచ్కుంద: గర్భిణీ, బాలింతలు పౌష్టికాహారాన్ని అందించే అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మున్నూరుకాపు సంఘంలో అంగన్‌వాడీ పోషణ్ అభియాన్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ చాలా మంది మహిళలో రక్తహీనత ఉంటున్నట్లు అంగన్‌వాడి నివేదికలు చెబుతున్నాయని అన్నికేంద్రాలలో ఈ అంశంపై పూర్తిస్థాయిలో మహిళలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలకు గర్భిణులకు, చిన్నపిల్లలకు ప్రభుత్వ పరంగా విటమిన్ అందించే పౌష్టిక విలువలు గల ఆహారాన్ని అందివడం జరుగుతుందని ప్రతిఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉండేందుకు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల సమస్యలు నిర్వహణ విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తెస్తే పరిష్కారం కోసం కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వీసీసీ డెలిగేట్ సభ్యులు విఠల్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, దేవర్‌శెట్టి, అశోక్, పార్టీ అధ్యక్షుడు గంగాధర్, మాజీ ఎంపీటీసీ సురేష్‌గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి: అదనపు కలెక్టర్

తాడ్వాయి, సెప్టెంబరు24: గ్రామాల్లో డెంగీ, వ్యాధులు ప్రబలకుండా అధికారులు తక్షణమే తగు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం మండలంలోని సోమరంతండాలో నిర్వహించిన హెల్త్‌క్యాంపును పరిశీలించారు. గ్రామాల్లోని పారిశుధ్య మురికికాలువలను పరిశీలించారు. చెత్తచెదారం ఉండడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారులు ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రాజారాం, ఎంపీడీఓ సయ్యద్‌సాజిద్‌అలీ, ఎంపీఓ సవితారెడ్డి పాల్గొన్నారు.

మూలమలుపు ప్రదేశాన్ని పరిశీలించిన అధికారులు

నసురుల్లాబాద్, సెప్టెంబరు24: "మూల మలుపులు మృత్యు పిలుపులు" అనే శీర్షకన ఆదివారం ప్రచురితమైన 'ఆంధ్రజ్యోతి' కథనానికి ఏఆర్‌టీ అధికారులు స్పందించారు. మండలకేంద్రంలోని మూలమలుపు ప్రదేశాన్ని ఏఆర్‌టీ బృందం పరిశీలించిన అనంతరం ఏఆర్‌టీ బృందం అధికారులు మాట్లాడారు. నిజామాబాద్ - బాన్సువాడ ప్రధాన రహదారి మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అదే విధంగా స్పీడ్ బ్రేకర్లు వేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ బృందం సభ్యు లు, బాన్సువాడరూరల్ సీఐ సత్యనారాయణగౌడ్, డిప్యూటీ తహసీల్దార్ బావయ్య, ఏఎస్ఐ వెంకట్రావ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి పౌష్టికాహారం తీసుకోవాలి

బాన్సువాడటౌన్, సెప్టెంబరు24: ప్రతీ విద్యార్థి మంచి ఆహారాన్ని తీసుకోవాలని బాన్సువాడ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యమైన ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు ఏజాస్, హకీం, నార్ల ఉదయ్, విద్యార్థులు తదితరులున్నారు.

బస్సులో నుంచి కింద పడిన విద్యార్థిని

- తలకు గాయం.. ఆసుపత్రికి తరలింపు

లింగంపేట, సెప్టెంబరు 24: మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తావద్ద మంగళవారం డిగ్రీ విద్యార్థిని బస్సులో నుంచి పడి తలకు తీవ్రగాయాలు కావడంతో కామారెడ్డిలని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. లింగంపేటకు చెందిన కావ్య ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రి కళాశాలలో డిగ్రి చదువుతోంది. కామారెడ్డి నుంచి పిట్లం వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఎక్కేందుకు అంబేద్కర్ చౌరస్తాలో ఎక్కింది. విద్యార్థిని తల్లి కూడా ఎల్లారెడ్డిలోని ఆసుపత్రికి వెళ్లేందుకు వస్తుండడంతో తల్లికోసం కొద్దిగా అపాలని కోరగా డ్రైవర్ బస్సును పక్కకు తీస్తుండగా విద్యార్థిని బస్సులో నుంచి కిందకు దిగేందుకు ప్రయత్నించగా బస్సులోనుంచి జారిపడి తలకు తీవ్రగాయాలయి స్పృహ కోల్పోవడంతో ఆమెను కామారెడ్డిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్సలు నిర్వహిస్తున్నారు. ఆమెకు ఎలాంటి ప్రాణ హాని లేదని కుటుంబ సభ్యులు తెలిపారు.


ఎస్సీ బాలికల వసతి గృహ ఆవరణ పరిశీలిస్తున్న ఆర్డీవో ప్రభాకర్

వసతి గృహాలను పరిశీలించిన ఆర్డీవో

ఎల్లారెడ్డి, సెప్టెంబరు24: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నే ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న ఎస్సీ, బీసీ బాలికల వసతిగృహాల ఆవరణను ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల దృష్ట్యాఆవరణలో వర్షపు నీరు నిల్వఉండకుండా చూడాలని, పిచ్చి మొక్కలను తొలగించాలని వార్డెన్‌లకు సూచించారు. అలాగే విద్యార్థులకు మెనూప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని, వార్డెన్ శారదకు సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు, నాయకులు పోచయ్య, మున్సిపల్ సిబ్బంది, లక్ష్మణ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు

బీర్కూర్, సెప్టెంబరు24: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కేంద్రం వైద్యురాలు గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు వారికి ఉచితంగా మందులను పంపిణీచేశారు. ప్రతీరోజు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వాకింగ్ లాంటి చిన్న చిన్న వ్యాయామాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు గురుకుల పాఠశాల విద్యార్థుల ఎంపిక

మద్నూర్, సెప్టెంబరు24: మండల కేంద్రంలో బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు బిచ్కుందలో జరిగిన జోనల్ లెవల్ క్రీడాపోటీల్లో మొదటి బహుమతి సాధించారు. అలాగే జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గంగా కిషోర్ తెలిపారు. బిచ్కుందలో జరిగిన అండర్ 14, 17 కబడ్డీ, ఖోఖో వాలీబాల్ పోటీలలో మొదటి బహుమతి సాధించారు. జిల్లాస్థాయిలో జరగనున్న క్రీడా పోటీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. జోనల్ లెవల్ క్రీడా పోటీల్లో మొదటి బహుమతి సాధించిన విద్యార్థులకు పాఠశాల సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ గణేష్, అధ్యాపకులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల్లేక పనులు చేయలేకపోతున్నాం..

- నిధులు మంజూరు చేయించాలని ఎంపీడీవోకు పంచాయతీ కార్యదర్శుల వినతి

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు24: గ్రామ పంచాయతీల్లో నిధుల్లేక పూర్తిస్థాయిలో పనులు చేయలేకపోతున్నామని, 15వ ఫైనాన్స్, ఎస్ఎఫ్‌జీ నిధులు మంజూరయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని సోమవారం ఎంపీడీవో ప్రభాకర్ చారికి మండల పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రాన్ని అందజేశారు. ఇప్పటికే తాము అప్పులుచేసి గ్రామాల్లో ముఖ్యమైన, అత్యవసరమైన పనులను చేపడుతున్నట్లు తెలిపారు. అప్పులుచేసి గ్రామాల్లో అత్యవసర పనులు, విద్యుత్ స్తంభాలకు బల్బుల ఏర్పాట్లు, పారిశుధ్య కార్యక్రమాలు, అంటు వ్యాధుల నివారణ చర్యలు చేపడుతున్నామని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. రెండు నెలలుగా మల్టీపర్పస్ గ్రామ పంచాయతీ కార్మికులకు జీతాలు ఇవ్వాల్సి ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మల్లికార్జున్, తిరుపతి, అజీముద్దీన్, బాల్‌రాజ్, మమత తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు సౌత్‌క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

భిక్కనూరు, సెప్టెంబరు 24: మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, అధ్యాపకులు మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్‌లో ప్రతీ విద్యార్థి వాలంటీర్‌గా అన్నికార్యక్రమాల్లో పాల్గొని సమాజంలో ఉన్నటువంటి సమస్యలను అవగాహన చేసుకుని వాటికి పరిష్కార మార్గాలు చూపుతూ సమాజ అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు అంజయ్య, హరిత, అధ్యాపకులు పాల్గొన్నారు.


క్యాంపస్‌లో మొక్కలు నాటుతున్న దృశ్యం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ఫార్మేషన్ డే ప్రతీ సంవత్సరం సెప్టెంబరు 24న జరుపుకుంటామని ఇది మహాత్మా గాంధీ పేరు మీద 1969లో ప్రారంభమైందని తెలిపారు. వాలంటీర్లు సేవా భావం కలిగి ఉండాలని అలాంటి భావం కలిగి ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటూ సేవ చేస్తే గుర్తింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ చంద్రకాంత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణ ప్రసాద్, కళాశాలసిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో హెచ్ఎంలకు ఎంఈవోలుగా బాధ్యతలు

కోటగిరి, సెప్టెంబరు24: ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టులను భర్తీచేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ హెడ్‌మాస్టర్లను ఎంఈవోలుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. నిజామాబాద్ జిల్లాలో 33 మండలాకు ఒకరు పూర్తిస్థాయి ఎంఈవోగా ఉండగా 32ఖాళీలు ఉన్నాయి. ఇప్పటివరకు ఒక్కో ఎంఈవోకు 9నుంచి 10మండలాలు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కామారెడ్డి జిల్లాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో 58మంది ప్రధానోపాధ్యాయులకు పూర్తిస్థాయి ఎంఈవో బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత కొన్ని సంవత్సరాలుగా పూర్తిస్థాయి ఎంఈవోలు లేకపోవడంతో విద్యాశాఖపై అజమాయిషీ కరువైంది. ప్రస్తుతం పూర్తిస్థాయి ఎంఈవోలను నియమించడంతో పాఠశాలల పర్యవేక్షణ, విద్య వ్యవస్థ మెరుగుపడనుంది.


ఒప్పంద పత్రాన్ని వీడీసీ సభ్యులకు అందజేస్తున్న దృశ్యం

భిక్కనూరులో అఖిలపక్షం సమావేశం

- వాగ్వాదానికి దిగిన ఇరుపక్షాలు
- వీడీసీకి చెందిన 10గుంటల భూమిని ఇచ్చేందుకు అంగీకారం

భిక్కనూరు, సెప్టెంబరు24: గతకొన్ని రోజులుగా భిక్కనూరు మండలకేంద్రంలో గ్రామాభివృద్ధికి చెందిన 10గుంటల భూమిని కొందరు కబ్జా చేస్తున్నారని అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం భిక్కనూరు మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ సమీపంలో క్లబ్ వద్ద అన్ని కులసంఘాలతో అఖిలపక్షం నాయకులు సమావేశమై, గ్రామాభివృద్ధికి చెందిన భూమి చుట్టూ హద్దులు ఏర్పాటుచేసి కబ్జాకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సుదర్శన్, తదితరులను పిలిపించి మాట్లాడారు. ఈమేరకు వీడీసీ సభ్యులకు, కబ్జా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ తాము ఎవరి భూమి కబ్జా చేయలేదని, తమవద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, గ్రామాభివృద్ధికి సంబంధించిన 10 గుంటల భూమిని ఆనుకునే తాము 16 గుంటల భూమిని కొనుగోలు చేసినట్లు చెప్పారు. కాగా ఈ 1019 సర్వేనెంబర్‌లో రికార్డుల్లో ఉన్నదాని కంటే భూమి తక్కువగాఉందని, అయినా గ్రామాభివృద్ధికి సంబంధించిన 10గుంటల భూమిని వదిలి మిగిలిన భూమిని తాము తీసుకుంటామని తెలిపారు. దీంతో ఇరువర్గాల వారు ఒప్పంద పత్రం రాసుకుని ఈనెల 28న హద్దులు ఏర్పాటు చేసుకుందామని రాజీకి రావడంతో అఖిలపక్షం నాయకులు ఆందోళన విరమించారు.

- మిగిలా బాధితులకు అండగా నిలబడాలని డిమాండ్

మండలకేంద్రంలో చాలా కబ్జాలు జరిగాయని, ప్లాట్లు, భూమి కబ్జాకు గురైనా బాధితులకు సైతం ఇలాగే అఖిలపక్షం నాయకులు అండగా నిలబడాలని పలువురు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు రమేష్, సమాచార హక్కుచట్టం జిల్లాప్రతినిధి రవీందర్, శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో కబ్జాలు ఎక్కువయ్యాయని, అవకాశవాద రాజకీయాలకు తావు లేకుండా ఈ విషయంపై అఖిలపక్షం నాయకులు మరో సమావేశాన్ని త్వరలోనే ఏర్పాటు చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

పెద్ద కొడప్‌గల్, సెప్టెంబరు 24: మండలంలోని శివాపూర్ గ్రామంలో గల బాలుర ఎస్సీ వసతి గృహాన్ని మంగళవారం మండల ప్రత్యేక అధికారి కిషన్, ఎంపిడివో లక్ష్మీకాంత్ రెడ్డిలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు వసతి గృహంలోని సౌకర్యాలను పరిశీలించారు. వసతి గృహంలోని టాయిలెట్లు పరిశీలించి బాత్రూం డోర్లు బిగించాలని ఆదేశించారు. దీంతో పాటుగానే నీటి సరఫరా చేసే నల్లాలను బాగుచేయించాలని సూచించారు. వసతి గృహంలో పేద విద్యార్థులు ఉంటున్నందున వారికి నాణ్యతతో కూడిన భోజనం అందించాలని ఆదేశించారు. ప్రస్తుతం వైరల్ రోగాలు వ్యాపిస్తున్ననందు ప్రతి విద్యార్థి ఆరోగ్యాన్ని పరిరక్షించాలని ఏఎన్ఎంకు సూచించారు. అనంతరం పాఠశాలను పరిశీలించి రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ దశరథ్ తదితరులు పాల్గొన్నారు,

సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో భక్తుల పూజలు

బాన్సువాడటౌన్ , సెప్టెంబరు24: పట్టణంలోని సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అర్చకులు స్వామి వారి మూలవిరాట్టుకు అభిషేకం, అర్చనలు చేపట్టారు. భక్తులు సమర్పించిన నూతన వస్త్రాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు , భక్తులు తదితరులున్నారు.

బ్రెయిన్‌ట్యూమర్ వ్యక్తికి ఎంపీ రూ.7లక్షల సాయం


బాధితుడి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎంపీ

మద్నూర్, సెప్టెంబరు24: డోంగ్లి మండలానికి చెందిన సుశాంత్ పటేల్ బ్రెయిన్‌ట్యూమర్ వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రిలో చేరాడు. ఆపరేషన్ నిమిత్తం రూ.7లక్షల ఖర్చు రావడంతో కుటుంబసభ్యులు జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌ను సంప్రదించారు. స్పందించిన ఎంపీ సీఎం సహాయ నిధి కింద 7లక్షలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు కార్పొరేట్ వైద్య సౌకర్యం అందిస్తున్నట్లు గుర్తుచేశారు. వచ్చేనెల నుంచి ప్రతీ రేషన్ కార్డుదారుడికి హెల్త్‌కార్డు అందజేయడానికి సీఎం అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారని గుర్తుచేశారు.

మాజీ ఏఎంసీ కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ

పిట్లం: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి మృతిచెందడంతో వారి కుటుంబసభ్యులను జహీరాబాద్ ఎంపీ సురేష్‌శెట్కార్ పరామర్శించారు. మంగళవారం ఎంపీ కాంగ్రెస్ పార్టీ మాజీ ఏఎంసీ చైర్మన్ కుటుంబ సభ్యులతో మాట్లాడి అండగా ఉంటామని తెలిపారు. మాజీ ఏఎంసీ బాల్‌రెడ్డి చిత్రపటానికి పూల వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఉన్నారు.

వరికి తెగుళ్లు వ్యాపిస్తే పురుగుల మందు పిచికారీ చేయాలి

సదాశివనగర్, సెప్టెంబరు 24: వరి పంటలో వాతావరణ పరిస్థితులతో తెగుళ్లు అధికంగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని, రైతులు తెగుళ్లను గమనిస్తూ వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పురుగుల మందులు పిచికారీ చేసుకోవాలని జిల్లావ్యవసాయాధికారి తిరుమలప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని మెడేగాంలో వరి పంటలను పరిశీలించారు. వరి పొలాల్లో రైతులు నత్రజని అధికంగా వాడొద్దని తెలిపారు. కార్యక్రమంలో ఏవో ప్రజాపతి పాల్గొన్నారు.

బాన్సువాడ పట్టణ సీఐగా బాధ్యతలు చేపట్టిన అశోక్

బాన్సువాడ టౌన్, సెప్టెంబరు 24: బాన్సువాడ పట్టణ సీఐగా మండలి అశోక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కృష్ణ బదిలీ కావడంతో, నిర్మల్ జిల్లా నుంచి అశోక్ బదిలీపై వచ్చారు. సీఐ అశోక్‌కు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

ఎల్లారెడ్డిలో భారీ వర్షం

ఎల్లారెడ్డి, సెప్టెంబరు24: ఎల్లారెడ్డిలో మంగళవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బీసీ కాలనీలో నివాసపు ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. దీంతో లోతట్టు ప్రాంతాలలోఉన్న కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కాలనీవాసులు తెలిపారు. మురికి కాలువలు శుభ్రంచేసి వర్షపు నీళ్ళు దిగువకు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


ఇళ్ల ముందు నిలిచిన వర్షపు నీరు

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

థియేటర్	సినిమా
శాంతి	సరిపోదా శనివారం
దర్శన్	ఏఆర్ఎమ్
ప్రియా 35	మత్తు వదలరా-2

బాన్సువాడ

థియేటర్	సినిమా
మహేశ్వరి	హైడ్ అండ్ సీక్
వెంకటేశ్వర	ఉత్సవం

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	120	150	180
వెన్‌కాబ్(కిలో)	130	160	190

